ప్రజలకు చంద్రబాబు కరెంటు షాక్



విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు



గుజ్జనగుండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, మేయర్ కావటి మనోహరనాయుడు, నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- కూటమి పాలనలో సంక్షేమ పథకాలను తుంగలో తొక్కారు
- ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడే.. బాదుడు
- గుజ్జనగుండ్లలోని విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట నిరసన
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, ప్రజలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యుత్ చార్జీలను పెంచి, ప్రజల నడ్డి విరచడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో గుజ్జనగుండ్లలోని విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయం వద్ద పోరుబాట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పక్కనపడేసిన చంద్రబాబు ప్రజలను నిలువునా దగా చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచిందని, తాను అధికారంలోకి వస్తే తగ్గిస్తామని హామీ ఇచ్చిన బాబు నైజం ఆర్నెల్లలో బయటపడిందని తెలిపారు. రూ.15వేల కోట్ల సర్దుబాటు చార్జీలను ప్రజల ముక్కు పిండి వసూలు చేసేందుకు సిద్ధమయ్యారని, పేద, మధ్య తరగతి వర్గాల ముక్కుపిండి బిల్లులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు పరిపాలన అందించడంలో కంటే ప్రతిపక్షాల గొంతును నొక్కడంలో బాబు సిద్ధహస్తుడని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు యాక్టివిస్టులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు.

పెంచిన చార్జీలను ఉపసంహరించుకునే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం తప్పా ఎక్కడా అభివృద్ధి, సంక్షేమ జాడలు లేవని విమర్శించారు.

బాబు పాలనలో నిలిచిన సంక్షేమానికి కోత

నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ బాబు ఆర్నెల్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల్లో కోతలు మొదలయ్యాయని తెలిపారు. తల్లికి వందనం అమలు చేయకుండా విద్యార్థుల తల్లులను మోసగించారని విమర్శించారు. ఫీజు రీ-యింబర్స్‌మెంట్ లేక తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారని, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవడంతో పాటు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

- 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంతంలో తొమ్మిది యూనిట్లు వినియోగించిన ఒక ఇంటికి విద్యుత్ శాఖ రూ.397 బిల్లు వేసిందని చెప్పారు. మరో కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ ఎస్సీలకు సబ్సిడీ ఎత్తివేసి బిల్లులు విధిస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రజాకంతకంగా మారిందని ఆరోపించారు.
- పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బత్తుల దేవానంద్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను దూరం చేసేలా సర్వేలు నిర్వహిస్తున్నారని, ఫలితంగా గత ప్రభుత్వంలో పెన్షన్లు అందుకున్న వారు అర్హులు కాకుండా పోతున్నారని తెలిపారు.
- ఆటో యూనియన్ నాయకుడు మురళి మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీ-యింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి కళాశాలలకు ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. నిరసన కార్యక్రమంలో ఈచంపాటి వెంకట కృష్ణ, పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్, గురవయ్య, నాయకులు సూరసాని వెంకట్‌రెడ్డి, మామిడిరాము, వంగల వలివీరారెడ్డి, మండేపూడి పురుషోత్తం, బత్తుల దేవానంద్, కరీంబేగ్, ఉడతా కృష్ణ, సాంబశివరావు, మాదాసు భాగ్యారావు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ డీఈఈ నాసరయ్యకు వినతిపత్రం సమర్పించారు.

బాబు పాలనలో నిలిచిన సంక్షేమం

నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ బాబు ఆర్నెల్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, నీకు 15వేలు, నీకు 15వేలు అంటూ కనిపించిన ప్రతి విద్యార్థికీ చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు అబద్ధాలని తేలిందని, అసలు ఏ ఒక్కరికీ రూ.15వేలు అందించలేదన్నారు. ఫీజు రీ-యింబర్స్‌మెంట్ లేక తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారని, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. కేంద్రంతో సత్సంబంధాలను కలిగి ఉన్న చంద్రబాబు నిధులు తెచ్చి, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవడంతో పాటు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేయడం కూటమి ప్రభుత్వానికి సాధ్యం కాదని మేయర్ విమర్శించారు .

సమాజ హితమే సైన్సు లక్ష్యం కావాలి



కేలండర్ ఆవిష్కరిస్తున్న ప్రత్యూష సుబ్బారావు, కౌసల్యాదేవి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ హితమే సైన్సు లక్ష్యం కావాలని ప్రముఖ మానసిక శాస్త్ర నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థినులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది మానవుడు మొదలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి వరకు సైన్సు సాధించిన పురోభివృద్ధిని తెలియజేస్తూ జె.కిశోర్‌బాబు రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి ఆవిష్కరించారు. జిల్లా స్వశక్తి, సెట్ప్, యూత్ సర్వీసెస్ అధికారి రాధిక మాట్లాడుతూ జనాభాలో 65 శాతం పైగా ఉన్న యువత, విద్యార్థినులు బాధ్యతగా ఎదుగుతూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏ.ధర్మారెడ్డి, డాక్టర్ పెంచలయ్య, ఏ.రాధా మాధవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు సివిల్ సర్వీసుల పుస్తకావిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలపై రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 6 గంటలకు బ్రాడీపేట 2/6లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రతి విద్యార్థికీ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 94948 08589 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

కొరిటెపాడు(గుంటూరు): కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తపేట బ్రాంచి ఆవరణలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ టి.సుబ్బారావు మాట్లాడుతూ కోస్టల్ ఏరియా లోకల్ బ్యాంక్‌ను 1999లో స్థాపించినట్లు తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి లోకల్ ఏరియా బ్యాంక్ అని పేర్కొన్నారు. గత 25 ఏళ్లుగా సమాజానికి నమ్మకమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. కస్టమర్లకు అనుగుణంగా ప్రత్యేకమైన బ్యాంకింగ్ పరిష్కారాలు, డిజిటల్ మార్పులు, వినూత్న ఉత్పత్తులను అందించడంలో బ్యాంక్ ఎల్లవేళలా ముందుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారి శ్రీరావు, డాక్టర్ సీహెచ్. శివరామకృష్ణ, ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు

లక్ష్మీపురం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీ శాసన సభ్యుడు షేక్‌మస్తాన్ వలి అన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం దివంగత మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. షేక్‌మస్తాన్ వలి మాట్లాడుతూ దేశంలో రైతులకు రుణ మాఫీ, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. మన్మోహన్ సింగ్ ఆశయాలకు అనుగుణంగా నాయకులు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏపీసీసీ ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇంచార్జి బిళ్లా సునీల్ పాల్గొన్నారు.

పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజులపాటు జరగనున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రముఖ కళాకారులు గొట్టిపాటి నాగేశ్వరరావు శ్రీరాముడిగా, కె.కోటేశ్వరరావుచౌదరి ఆంజనేయుడుగా శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. నటన ధురీణ కె.వెంకటేశ్వరరావు మయసభలోని దుర్యోధన పాత్ర ఏకపాత్రాభినయంతోపాటు, చింతామణి, పల్నాటి యుద్ధం, సత్యహరిశ్చంద్ర వంటి ప్రముఖ నాటికల్లో ముఖ్య ఘట్టాలు, పౌరాణిక పద్యాలను కళాకారులు ప్రదర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: 11 కేవీ బ్రాడీపేట ఫీడర్‌లో చెట్లు తొలగించడం, లైన్ మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు బ్రాడీపేట 1/14 నుంచి 6/18 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

కౌన్సిల్ సమావేశం నాలుగో తేదీకి వాయిదా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈ నెల 20న జరిగిన విషయం తెలిసిందే ! దానికి కొనసాగింపు శనివారం జరగాల్సి ఉంది. అయితే, దేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అకాల మరణం కారణంగా కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 26 నుంచి జనవరి 1వ తేదీ వరకు సంతాప దినాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో 28న జరగాల్సిన కౌన్సిల్ సమావేశం జనవరి 4వ తేదీకి వాయిదా వేసినట్లు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు.

మత్తు విభాగానికి వైద్య పరికరం వితరణ



గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు డాక్టర్ టి.నిర్మల, డాక్టర్ కె.నవీన్, డాక్టర్ కె.ఉమాశంకర్ శుక్రవారం గుంటూరు జీజీహెచ్ ఎనస్థీషియా (మత్తు) వైద్య విభాగానికి రూ.1.60 లక్షల ఖరీదు చేసే న్యూరో మస్క్యులర్ మానిటర్‌ను అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ చేతుల మీదుగా ఎనస్థీషియా వైద్య విభాగాధిపతి డాక్టర్ పోలయ్యకు అందజేశారు.

అబాకస్‌లో కేఎల్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రత్తయ్య, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం జేకేసీ కళాశాలరోడ్డులోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ సంస్థ అయిన సిప్ అబాకస్ నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 29న విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు వివరించారు. ఒకటో తరగతి నుంచి జి. సాత్విక, జ్ఞానలక్ష్మి, ముత్యం, ముతహీర్, షేక్ అహ్మద్, కె. సుదీక్ష, షేక్ రిఫాత్, 2వ తరగతి నుంచి ఆర్. గౌతమ్‌కృష్ణ, ఆర్. మోహిత, జి. లక్ష్మీదీప్తి, సీహెచ్ ప్రశంస, టి. మోనిక, 3వ తరగతి నుంచి ఆర్. వెంకట మోహనీష్, ఎం. సన్విత, సీహెచ్ హనివ్, కె. ద్వారకానందన్‌రెడ్డి, కె. సమీర్, 4వ తరగతి విద్యార్థులు ఎస్.ఎస్తేర్ ఇరాక్, సీహెచ్ తరుణ్యదేవి, సన్మతి, ఈ. కార్తీక, ఆర్. రిత్విక, 5వ తరగతి విద్యార్థులు డి. వెంకట విద్యారాణి, ఎస్. నిస్సీ ఒలీవియా, కె. అయ్యప్ప, తన్మశ్రీ సాయి, కె. మణికంఠ హాజరు కానున్నట్లు తెలిపారు. 5వతరగతి విద్యార్థిని డి.వెంకట విద్యారాణి ఢిల్లీలో జరిగిన అబాకస్ కాంపిటీషన్‌లో అంతర్జాతీయస్థాయిలో 5వ స్థానం, జాతీయస్థాయిలో 3వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

లక్ష్మీపురం: అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వామపక్ష పార్టీల జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌పై అభ్యంతరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు, నిరసనలు వెల్లువెత్తినా అమిత్ షాను ప్రధాని నరేంద్ర మోడీ వెనకేసుకురావడం భారతీయులకు తలవంపు అని ఎద్దేవా చేశారు. అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ డిసెంబర్ 30న జాతీయస్థాయిలో నిరసన కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే నగరంలోని లాడ్జి సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీస్థాయిలో నిరసనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజా సంఘాలు పాల్గొని అమిత్ షా వైఖరిని ఖండించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్, సీపీఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరావు , సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపోరు జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నేతలు మేడా హనుమంతరావు, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్ : వేసవిలో గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా సంగం జాగర్లమూడి ప్లాంట్ నుంచి అదనంగా నీటిని వినియోగించుకోవడానికి తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ సంగం జాగర్లమూడి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్లాంట్‌లో సమస్యల్ని యుద్ధప్రాతిపదికన చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డీఈఈ హనీఫ్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజలు స్థానిక సమస్యలపై అందించే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీల్లో సమస్యలను పరిశీలించడానికి నల్లచెరువు బొమ్మల సెంటర్, బుడంపాడు ఎస్టీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్డులోని గాయత్రీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యపై చర్చించి, పరిష్కార చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈలు మధుసూధనరావు, రమేష్ బాబు, సతీష్ కుమార్, డీసీపీ చంద్రశేఖర్, టీపీఎస్ లక్ష్మణస్వామి, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధార్మిక ప్రాంగణంలో సద్ది ప్రారంభం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం ధార్మిక ప్రాంగణంలో శుక్రవారం త్రయోదశి (13వ) సద్ది ప్రారంభమైంది. వచ్చేనెల 14 వరకు ఆలయ పాలక మండలి, ధార్మిక విజ్ఞాన్ పరిషత్, దాతలు, భక్తుల సంయుక్త నిర్వహణలో కొనసాగనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ తెలిపారు.

సిరిల్ పాల్‌పై కొనసాగుతున్న విచారణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అకౌంట్స్ విభాగంలో జరిగిన అవకతవకలపై గతంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన సిరిల్‌పాల్‌పై విచారణ కొనసాగుతోంది. శుక్రవారం విచారణలో భాగంగా లాలాపేట పోలీసులు సిరిల్‌పాల్‌ను తీసుకొచ్చి నగర కమిషనర్, అదనపు కమిషనర్లతో మాట్లాడించారు. అనంతరం అకౌంట్స్ విభాగంలో విచారించారు.

అరుదైన ఆపరేషన్‌తో రోగికి ప్రాణదానం



గుంటూరు మెడికల్: ఏడాదిగా మలద్వారా రక్తం పోతూ తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితికి చేరిన రోగికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం సర్జరీ వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ వెల్లడించారు. తెనాలికి చెందిన సీహెచ్.మల్లేశ్వరి పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఏడాదిగా ఆమెకు మల ద్వారం ద్వారా రక్తం పోతోంది. పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ వ్యాధి తగ్గుముఖం పట్టలేదు. ప్రతిరోజూ రక్తం పోవడం ద్వారా తీవ్ర రక్తహీనత ఏర్పడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. నెలరోజుల క్రితం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకు రాగా మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు చిన్నపేగు పరీక్ష (ఇంట్రోస్కోపి) చేశారు. పేగు చివరన ఒక సెంటీమీటరు సైజులో చిన్న క్లాట్ ఉండటం వల్ల దాని నుంచి రక్తం కారుతున్నట్లు గుర్తించారు. బయాప్సీ చేసి మెరుగైన చికిత్స నిమిత్తం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులకు రిఫర్ చేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు నవంబరు 19న మల్లేశ్వరికి 3 గంటలసేపు ఆపరేషన్ చేసి సమస్యను తొలగించారు. సుమారు రూ. 2.50 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత తెలిపారు. వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ అభినందించారు.

ల్యాప్రోస్కోపీతో కుట్లు వేయడంపై వర్క్‌షాపు



గుంటూరు మెడికల్: జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ వైద్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల అనాటమీ వైద్య విభాగంలో ల్యాప్రోస్కోపిక్ సూచరింగ్ బెజునో బెజునల్ అనస్టమోసిస్ ప్రక్రియపై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. గుంటూరుకు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, ఇంగ్లండ్‌లో స్థిరపడిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎ.సోమయ్య, హైదరాబాద్ కాంటినెంటల్ హాస్పిటల్ రోబోటిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ గణేష్ సూచరింగ్ గురించి యువ వైద్యులకు వివరించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణలు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభించారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీ సభ్యులు భాగస్వాములు కావాలని సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి పేర్కొన్నారు. సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో పాటు పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల బాధ్యతలపై రీసోర్స్ పర్సన్లకు జిల్లాస్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులందరూ పూర్తిగా సమన్వయంతో పనిచేస్తూ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చే విధంగా పర్యవేక్షించాలని, రోజుల తరబడి గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థుల ప్రగతిని నిరంతరం పరిశీలించడంలో ఎస్ఎంసీ సభ్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పరిశీలకుడు మనోహర్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం, డీఆర్పీలు ప్రసాద్, ఏడుకొండలు, జాకబ్ పాల్గొన్నారు.

యూత్ గేమ్స్ విన్నర్స్‌గా లోటస్ ఆధ్య విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వెంకటేశ్వరరావు, జీవీఎస్ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతవారం న్యూఢిల్లీలో నిర్వహించిన యూత్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో లోటస్ ఆధ్య పాఠశాల విద్యార్థులు విన్నర్లుగా నిలిచారని డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కృష్ణనగర్‌లోని లోటస్ ఆధ్య హైస్కూల్లో శుక్రవారంజరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అండర్-16 వాలీబాల్, అండర్-12 బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్లుగా నిలిచిన విద్యార్థులు పాఠశాల కీర్తి, ప్రతిష్టలు ఇనుమడింప చేశారని తెలిపారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించడంతోపాటు జాతీయస్థాయిలో వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్స్‌గా నిలవడం ద్వారా క్రీడలపై లోటస్ ఆధ్యా పాఠశాల యాజమాన్యం చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్ చక్రి పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విద్యలో పారిశ్రామిక సందర్శన కీలకం



సందర్శనకు బయలుదేరిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మేనేజ్‌మెంట్ విద్యలో పారిశ్రామిక సందర్శన కీలకమైన అంశమని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని కళాశాల ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా శుక్రవారం ఫిరంగిపురంలోని తులసి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌కు వెళ్లారు. ముడి సరుకు ప్రాసెసింగ్, ఉత్పత్తుల ప్యాకింగ్‌పై అవగాహన పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, ఎండీ తులసి యోగేష్, డైరెక్టర్ తులసి కృష్ణ చైతన్య సంస్థ కార్యకలాపాలను గురించి విద్యార్థులకు వివరించారు. పర్యటనలో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ కె.లలిత, అధ్యాపకులు చల్లా వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, బి. అనిత, ఎన్. మణికంఠ పాల్గొన్నారు.